# వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 261 | బుధవారం | 24 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో

## నేనే వస్తా..

- వరంగల్‌ను అభివృద్ధి చేస్తా
- అండర్ గ్రౌండ్ డ్రేనేజీతోపాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తా
- టెక్స్ టైల్ పార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుతా
- అనకొండ అరూరిని గెలిపిస్తే మీ భూములు ఆంఫట్
- కావ్యను గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..
- వరంగల్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి

# ఓరుగల్లులో.. హోరా..హోరీ



### త్రిముఖ పోటీతో వేడెక్కిన రాజకీయం

- గెలుపు కోసం అరూరి ఆరాటం
- కసితో బీఆర్ఎస్ ఫోకస్
- దూకుడు పెంచిన పార్టీలు
- కాంగ్రెస్ ఊపుతో కడియం కావ్య





వరంగల్ లోక్ సభ ఎన్నికకు కౌంట్ డౌన్ మొదలైంది. సరిగ్గా 18 రోజుల్లో ప్రజలు తమ తీర్పు ఇవ్వనున్నారు. ఈ సీటుపై మూడు ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ రేపటితో ముగియనున్న నేపథ్యంలో అభ్యర్థులు పోటాపోటీ ప్రచారాలకు తెరలేపారు. ఇప్పటికే ప్రధాన పార్టీ అభ్యర్థులు తమ నామ పత్రాలను దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కడియం కావ్య, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అరూరి రమేష్, బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ నామినేషన్ వేశారు. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. హెూరా హెూరీ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వివిధ పార్టీల అగ్రనేతలు సైతం ఓరుగల్లు బాట పడుతున్నారు. అయితే కాంగ్రెస్- బీజేపీల మధ్యే నువ్వా - నేనా అనే స్థాయిలో పోటీ నెలకొంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

వివరాలు 2లో..



2లో

## నామినేషన్ దాఖలు చేసిన అరూరి రమేష్

## శంకర్ కుటుంబానికి అండగా ఉంటా

### పరామర్శించి మంత్రి సీతక్క



2లో..



8లో

## రెండో సెట్ నామినేషన్ వేసిన కడియం కావ్య

# ఓరుగల్లులో హోరాహోరీ



- త్రిముఖ పోటీతో వేడెక్కిన రాజకీయం
- దూకుడు పెంచిన పార్టీలు
- కాంగ్రెస్ ఊపుతో కడియం కావ్య
- గెలుపు కోసం అరూరి ఆరాటం
- కసితో బీఆర్ఎస్ ఫోకస్

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** ఎన్నికల ప్రచారంలో అన్ని ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం 14 స్థానాల్లో విజయం సాధించి తమ సత్తా చాటాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తెలంగాణలో నాలుగు సిట్టింగ్ ఎంపీలున్న భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సాధించాలన్న పట్టుదలతో ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గాల్లో కేంద్ర మంత్రులు పర్యటిస్తూ బీజేపీకి అండగా నిలువాలంటూ అభ్యర్థిస్తున్నారు. ముచ్చటగా మూడో సారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రపంచ దేశాల్లో భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందంటూ ప్రచారం చేస్తున్నారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాదరణ కోల్పోయి ప్రతిపక్షానికే పరిమితమైంది. దీంతో కనీసం పార్లమెంట్ ఎన్నికల్లోనైనా తమ సత్తా చాటాలన్న లక్ష్యంతో బీఆర్ ఎస్ ప్రచారం నిర్వహిస్తోంది.

## దూకుడు పెంచిన పార్టీలు

వరంగల్‌లో ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు కడియం కావ్య, అరూరి రమేష్, మారపెల్లి సుధీర్ కుమార్ తమ ప్రచారంతో మండు వేసవిలో మరింత హీట్ పెంచుతున్నారు. ఓరుగల్లు పార్లమెంట్ స్థానంపై జెండా పాతేందుకు కాంగ్రెస్ – బీజేపీలు ముందుకు కదులుతుంటే, సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తాపత్రయపడుతోంది. దీంతో ఇప్పటికే ప్రచారాన్ని ఉరకలెత్తిస్తున్నారు. గ్రామాగ్రామాన తిరుగుతూ మీటింగ్ లు పెట్టి తమను గెలిపిస్తే ఎం చేస్తామో వివరిస్తున్నారు.





## కాంగ్రెస్ ఊపుతో కడియం కావ్య..

వరంగల్ లోక్ సభ స్థానం ఎస్సీ రిజర్వ్ స్థానం కాగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన కడియం కావ్యకు టికెట్ ఇచ్చారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండగా.. ఎంపీ సీట్ గెలిచి పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ ఆరాటపడుతోంది. ఈ మేరకు నేతలందరినీ కలుపుకొని రెగ్యులర్ గా మీటింగులు కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పార్టీ వరంగల్ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో తరచూ మీటింగులు నిర్వహిస్తుండగా.. అదే వేడిని కొనసాగించేందుకు నేడు సీఎం రేవంత్ రెడ్డిని వరంగల్ తీసుకొచ్చి ప్రచార సభ నిర్వహించారు. ఇప్పటికే సంపూర్ణ బలం ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి రాకతో మరింత ఊపు వస్తుందని భావిస్తున్నారు.

## గెలుపు కోసం అరూరి ఆరాటం..

బీజేపీ అభ్యర్థిగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పోటీ చేస్తుండగా.. వరంగల్ లో ఆ పార్టీకి కొంత సానుకూల వాతావరణం కనిపిస్తోంది. వరంగల్ స్మార్ట్ సిటీకి కేటాయించిన నిధులు, నగర అభివృద్ధి, అమృత్, హృదయ్ లాంటి పథకాలతో చేసిన అభివృద్ధి కలిసి వస్తుందనే భావనతో ఆ పార్టీ నాయకులు ముందుకెళ్తున్నారు. దానికి తోడు ప్రధాని నరేంద్ర మోదీ లేదా హోంమంత్రి అమిత్ షాను తీసుకొచ్చి మరింత మైలేజ్ పెంచుకోవాలని పార్టీ నేతలు భావించారు. కానీ 25న హైదరాబాద్ రానున్న అమిత్ షా బాన్సువాడ బహిరంగ సభకు మాత్రమే హాజరుకానున్నట్లు తెలిసింది. ఇక 27న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ వస్తుండగా.. ఆయననూ వరంగల్ రప్పించేందుకు ఇక్కడి నేతలు ప్రయత్నాలు చేశారు. కానీ బిజీ షెడ్యూల్ కారణంగా ఆయన పర్యటన ఖరారు కాలేదు. దీంతోనే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింఘ్ ధామి టూర్ ను ఫైనల్ చేశారు. 25న అరూరి రమేశ్ నామినేషన్ వేయనుండగా.. పుష్కర్ సింఘ్ ధామి రోడ్డు షో నిర్వహించి, ప్రసంగించనున్నారు. ఇదిలా ఉంటే మే మొదటి వారంలోనైనా మోదీ లేదా అమిత్ షాను వరంగల్ తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

## కసితో బీఆర్ఎస్ ఫోకస్

ఎలాగైనా వరంగల్ పార్లమెంట్ స్థానంలో గెలిచి తమ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని కసితో బీఆర్ఎస్ పని చేస్తోంది. కాగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ బరిలో నిలవగా.. ఆయనను గెలిపించుకోవడం కంటే కడియంను ఓడగొట్టడంపైనే గులాబీ పార్టీ ఫోకస్ పెట్టింది. పార్టీ జిల్లా నాయకత్వం నుంచి పైవరకూ కడియంపై ప్రతీకారేచ్ఛతోనే ఉండగా.. కడియంను కావ్యను ఓడగొట్టడంపై కేసీఆర్, కేటీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ నగరానికి వచ్చి పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాలకు సంబంధించిన నేతలతో పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపౌ చర్చించారు. ఈ నెల 28న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్ లో రోడ్డు షో నిర్వహించనున్నారు. వారం రోజుల్లోనే ఇద్దరు బీఆర్ఎస్ కీలక నేతల టూర్ ఉండటంతో ఆ పార్టీ నేతల్లో కొంత ఉత్సాహం కనిపిస్తోంది.

# నేనే వస్తా..

- వరంగల్‌ను అభివృద్ధి చేస్తా
- అండర్ గ్రౌండ్ డ్రేనేజీతోపాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తా
- టెక్స్ టైల్ పార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుతా
- అనకొండ అరూరిని గెలిపిస్తే మీ భూములు ఆంఫట్
- కావ్యను గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..
- వరంగల్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి


**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేనే వచ్చి వరంగల్‌లో కూర్చుని ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తా.. ఔంటర్ రింగ్ రోడ్డుతోపాటు విమాన సౌకర్యం కల్పిస్తా.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తా..ఇక్కడున్న టెక్స్ టైల్ పార్కును అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోతానంటూ ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాంగంగా బుధవారం హనుమకొండ జిల్లా పరిధిలోని మడికొండ ప్రాంతంలో జరిగి జన జాతర సభలో మామ అల్లుళ్లు కేసీఆర్, హరీష్ రావులపై నిప్పులు చెరిగారు. మామ అల్లుళ్లు కేసీఆర్, హరీష్ రావు తోక తెగిన బల్లుల్లా ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆగస్టు 15వ తేదీలోపు రూ. 2లక్షల రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానన్నారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్ రావు తన మామను అడిగి తెలుసుకోవాలంటూ హితవు పలికారు. సవాల్ విసరడం కాదు రాజీనామాకు సిద్ధంగా ఉండాలంటూ చురకలంట్టించారు. ఆగస్ట్ 15న ఫోన్..రాజీనామా జేబులో పెట్టుకో అంటూ తీవ్రంగా హెచ్చరించారు.

## అభివృద్ధికి నాది పూచి..

పద్మశాలీలకు అండగా నిలబడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టైక్స్ టైల్ పార్క్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వరంగల్ నగరంలో చెత్త సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపేందుకు తానే స్వయంగా పనిచేస్తానని తెలిపారు. తెలంగాణలో రెండో అతి పెద్ద నగరమైన వరంగల్ లో విమానలు ఎగిరేలా మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధి చేసే బాధ్యత తనదని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వరంగల్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, దానికి నిధులు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## చచ్చిన పాము కేసీఆర్..

మామ, అల్లుల్లు తెలంగాణ ప్రజలను ఇంకా మోసం చేయాలని చూస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. చచ్చిన పాము కేసీఆర్ అన్నారు. ఆయన్ని ఇంకా ఏం కొడాతామంటూ సానుభూతి ప్రకటించారు. దేవ వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించబోతున్నారన్నారు. అబద్ధాల బీజేపీని ప్రజలు తరిమికొడతారన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ, బీఆర్ ఎస్ లకు గురణపాఠం తప్పదన్నారు.



## కావ్యను గెలిపించాలి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టాలని, వరంగల్ లో కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని రేవంత్ రెడ్డి కోరారు. విద్యావంతురాలు, రాజకీయం నేపథ్యం కలిగిన నాయకురాలు కడియం కావ్య అని ఆమెను గెలిపించాల్సిన బాధ్యత వరంగల్ ప్రజలపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఒక కొండా సురేఖ లాగా, ఒక సీతక్క లాగా, మరో నాయకురాలును తీర్చిదిద్దాలని ప్రజలను కోరారు. ఎంపీగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పార్లమెంట్ లో పోరాడి నిధులు తెస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను గెలిపిస్తే అనకొండలా మీ భూములు, స్థానిక గుట్టలను అమాంతం మింగేస్తాడని హెచ్చరించారు.

## సభ సక్సెస్..

ఓరుగల్లు జన జాతర సభ విజయవంతమైంది. కాజీపేట మండలం మడికొండ సేయింట్ పాల్స్ మైదానంలో బుధవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభ 'నభూతో..నభవిష్యత్' అన్న రీతిలో కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య విజయమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కార్యకర్తల్లో జోష్ నింపారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్ల నుంచి కార్యకర్తలు, నాయకులు ఈ సభకు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ పథకాలతోపాటు వరంగల్ ను హైదరాబాద్ కు ధీటుగా తీర్చి దిద్దుతానంటూ సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సభా ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జిందాబాద్, కడియం కావ్యకు జై అంటూ నినాదాలు మార్మోగాయి.

## ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు వేయాలి

### ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు




**వరంగల్ వాయిస్, పరకాల :** జిల్లా కలెక్టర్, స్వీప్ నోడల్ అధికారి ఆదేశాల మేరకు పరకాల మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకం పని జరుగుతున్న పని ప్రదేశంలో కూలీలకు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ మే 13న జరిగే పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో 80 సంవత్సరాలు దాటిన వారి ఇంటి వద్దనే ఓటు వేసే ఏర్పాటు చేయడం జరిగిందని, వికలాంగులు, వయో వృద్దులకు ట్రై సైకిల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు.

## ఉపాధి పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని రుద్రారం, కొండంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువులలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను బుధవారం అడిషనల్ డీఆర్డీవో వసుమతి పరిశీలించారు. అనంతరం వారు కూలీలతో మాట్లాడుతూ నిర్దేశిత కొలతల ప్రకారం పని చేసి 300 రూపాయల ఉపాధి కూలీ పొందాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పని ప్రదేశంలో నీడ, మంచి నీరు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గిరి హరీష్, ఈసీ మంగిలాల్, టెక్నికల్ అసిస్టెంట్ లు రమేష్, శైలజ, కార్యదర్శులు చరణ్, కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ లు రవిశంకర్, రాజేందర్, మహేష్ పాల్గొన్నారు.

## బోడ డిన్నాను కలిసిన నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ మాజీ కార్పొరేటర్ బోడ అన్నయ్ డిన్నా నివాసానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి విచ్చేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

## బొడ్రాయి ప్రతిష్ఠాపనలో మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** మండలంలోని రాయిని గూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, పచ్చని పాడి పంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయి

### బీజేపీ, బీఆర్ఎస్‌లు దొందు దొందే

### రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ని అధిక మెజారిటీ తో గెలిపించాలని మంత్రి సీతక్క ప్రజల ను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె వెంకటాపూర్ మండలం వెంకటాపూర్, నల్లగుంట, రామంజ పూర్ గ్రామాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీతక్క మండలం లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన డీసీసీబీ డైరెక్టర్, నర్సాపూర్ సహకార సంఘం చైర్మన్ మాడుగుల రమేష్, నర్సాపూర్ ఎంపీటీసీ గోపు స్వప్న వాసుదేవా రెడ్డి, నల్లగుంట మాజీ సర్పంచ్ మండల శ్రీధర్ రెడ్డి , నల్లగుంట ఉప సర్పంచ్ భూక్య శంకర్, నల్లగుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు సదా రమేష్, ఆత్మ డైరెక్టర్ మండల మధుకర్ రెడ్డి, నారాయణ గిరిపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు చలువాజీ రాజు, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, నేరెళ్ల నర్సింహా రెడ్డి, మట్ల వాసుదేవా రెడ్డి, మోరే సంపత్, శివతో పాటు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మంత్రి సీతక్క కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారని తెలిపారు. బీజేపీ మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తుందని పేర్కొన్నారు. మేము గేట్లు తెరిచాం ఇక బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయమని, ప్రజలందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 5 గ్యారంటీలు అమలు చేసిందని పేర్కొన్నారు. ఆగస్టు 15లోపు 2 లక్షల రుణమాఫీ చేస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, మండల ఎన్నికల ఇంచార్జిలు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ముస్సేపల్లి కుమార్ గౌడ్, మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్య నారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనుతో పాటు మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాటర్ ఫర్ బర్డ్స్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** యూత్ ఫర్ సేవ వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో వాటర్ ఫర్ బర్డ్స్ అనే కార్యక్రమం ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నీ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ వేసవి కాలంలో పక్షులు, జంతువులు, వేడిని తట్టుకోలేక, నీళ్లు లేక ఎన్నో మూగజీవులు కనుమరుగైపోతున్నాయన్నారు. ప్రకృతిని ప్రేమించే యూత్ ఫర్ సేవ వరంగల్ చాప్టర్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పక్షులకు, జంతువులకు ఎంతోఉపయోగపడుతుందని, మనందరం కూడా ప్రకృతిని రక్షించే ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ ఉండడం ఎంతో గొప్ప పని అని తెలియజేశారు. విద్యార్థులు కూడా తమ పరిసరాలలో మట్టి కుండలలో పక్షులకు, జంతువులకు నీళ్లు, ఆహారం అందించాలన్నారు. వాటి ద్వారానే మానవ జీవితం కూడా ఆధారపడి ఉంటుంది. కాబట్టి, వాటిని సమాజంలో ప్రతి ఒక్క పౌరుడు కూడా ప్రకృతిని రక్షించే విధంగా తయారుకావాలని తెలియజేశారు. యూత్ ఫర్ సేవ వలంటీర్స్ మట్టి కుండలకు పక్షులను జంతువులను ఆకర్షించే విధంగా పెయింటింగ్ వేశారు. యూత్ ఫర్ సేవ వరంగల్ కోఆర్డినేటర్ పోలస మల్లికార్జున్, కళాశాల లెక్చరర్ రాజు, యూత్ ఫర్ సేవ వలంటీర్స్ రాకేష్, ప్రియా, అనంత్‌రెడ్డి, కరుణాకర్, గణేష్, వలంటీర్స్ పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఉచిత సంచార వాహన సేవలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఆనంద ఆశ్రయ ఆవరణలో 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరాన్ని ఆనంద ఆశ్రయ మేనేజింగ్ ట్రస్ట్ ఈటల సమ్మయ్య ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ ఆరోగ్య శిబిరంలో హనుమకొండ రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జి.కిషన్ రావు, డా. మొహమ్మద్ తహార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, క్రాంతి, పవన్, నరసింహా చారి, రాజు, ఆనంద ఆశ్రయ అనుముల యాదగిరి, ప్రీతి, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# మోసపూరిత హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** మోసపూరిత హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తా ఆ ప్రభుత్వానికి లేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికలు రాగానే ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ మోసంచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకసారి మోసపోతే అది నాయకుల తప్పు అవుతుందని, రెండోసారి కూడా మోసపోతే అది వందకు వందశాతం ప్రజలదే తప్పు అవుతుందన్నారు. అందుకే రెండోసారి మోసపోదామా అని ఈ సందర్భంగా ఆయన ప్రజలను ప్రశ్నించారు. మతం పేరుతో విద్వేషాలు నింపి ఎంపీ సీట్లు గెలవాలని భావిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ప్రజలకు తెలిసిపోయిందని తెలిపారు. బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు తెలపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, నాలుగు కోట్ల ప్రజలను నమ్మించి మోసం చేసిన అబద్దాల హస్తం పార్టీకి బుద్ది చెప్పాలని ప్రజలకు ఎదురు చూస్తున్నారన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ కు అత్యధిక మెజారిటీ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం సాగించాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎఫ్‌సీఐ గోడౌన్ లో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ కార్యక్రమం శివారపు శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించగా ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్రటిరక్తం చిందినా, ఎరుపు జెండా సృష్టించిన రోజు హక్కులన్నీ పోరాటం ద్వారా దక్కుతాయని చాటిన రోజు అమరులాశయం సాధించగా అరుణపతాకం ఎగివిన రోజు మేడే అని అన్నారు. ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని, తరతరాల దోపిడీకి చరమగీతం పాడాలని, కార్మికలోకం కదిలి చికాగో నగరంలోని హే మార్కెట్ దగ్గర కదం తొక్కిన వేళ, వెంబేలెత్తిన దోపిడీశక్తులు, వారి పోలీసులు జరిపిన పాశవిక కాల్పుల్లో కార్మికుల నెత్తురు వరదలై పారింది. ఎంతోమంది కార్మికులు నేలకొరిగారు. వందలాది మంది గాయపడ్డారు. ఆ నెత్తుడి చిత్తడి నుంచి కార్మికుడు ఎగరేసిన చొక్కా ప్రపంచ వ్యాపితంగా అరుణ పతాకమై, అరుణారుణమై ఒకృతకు చిహ్నంగా నిలిచింది. ప్రపంచ కార్మిక విముక్తి కేతనమయ్యింది. కార్మికులేకాదు ఇప్పుడు ప్రతిపౌరుడు అనుభవిస్తున్న ప్రతి హక్కు పోరాటం ద్వారా సాధించిందేనని తెలిపారు. 8 గంటల పనిదినం హక్కుతో పాటు కార్మిక సంఘాల స్థాపన హక్కు ఉద్యోగ భద్రతహక్కు, ఉపాధి కల్పన హక్కులను మోదీ ఫాసిస్టు రాజ్యమే కుళస్తున్న వేళ ఉరి తంబాలెక్కిన బిలాగో అమరుల సాక్షిగా ఫాసిస్టు బీజేపీ దానికి మద్దతుగా ఉన్న పార్టీలకు వ్యతిరేకంగా పోరాడాలని, వచ్చే ఎన్నికల్లో ఓడించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టి.యు) రాష్ట్ర కార్యవర్గం కార్మిక వర్గానికి పిలుపునిచ్చిందిది. మోదీ అనుసరిస్తున్న సామ్రాజ్య వాద అనుకూల విధానాలకు నిరసనగా, పాలస్తీనాకు మద్దతుగా ఈ మేడేను జరపాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టీయూ) కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే సీతారామయ్య, రాష్ట్ర నాయకుడు ఎల్ విశ్వనాథం, ఐఎఫ్ టీయూ ఏరియా కమిటీ నాయకులు కట్ల నాగరాజు, హమాలి యూనియన్ అధ్యక్షులు అయిలబోయిన దశరథం, అయిలబోయిన వెంకన్న, చల్ల రమేష్, చేపూరి సత్యం, తదితరులు పాల్గొన్నారు

# దోపిడీ అంతానికి సీపీఐ ఎంఎల్ పోరాటం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** దేశవ్యాప్తంగా పీడిత, తాడిత ప్రజలపై సాగుతున్న శ్రమ దోపిడీ అంతం కోసం సీపీఐ (ఎంఎల్) అవసరమని సీపీఐ (ఎంఎల్ ) మాస్ లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముజంపల్లి వీరన్న, నెల్లికుదురు మండల కార్యదర్శి ఇరుగు అనిల్ డివిజన్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ ఎంఎల్ 55వ ఆవిర్భావ దినోత్సవం, మార్క్స్ మహోపాధ్యాయులు లెనిన్ 154 జయంతిని పురస్కరించుకొని నెల్లికుదురు మండల కేంద్రం, ఆలేరు, మెచరాజపల్లి గ్రామాలలో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగం వ్యవసాయ కూలీలు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, చిన్న తరహా పరిశ్రమలు నడుపుకుంటున్న ప్రజానీకం నేటి పాలకుల విధానాల మూలంగా అనేక కష్టాలు అనుభవిస్తున్నారని అన్నారు. కష్టాలను దూరం చేస్తామని 75 సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న పాలకవర్గాలు ప్రజల కష్టాలను పెంచి కార్పొరేట్ బహుళ జాతి కంపెనీల ఆదాయాన్ని రెట్టింపు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకులపై క్రూరమైన చట్టాలను ప్రయోగిస్తూ తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. జైలు, కేసులు జైలు నిర్బంధం హత్యలు ఎన్కౌంటర్లు నిత్య కృత్యంగా మారాయని అన్నారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవుల్లో కూర్చున్న పాలకవర్గాలు ముఖ్యంగా బీజేపీ రాజ్యాంగ వ్యతిరేకంగా పరిపాలిస్తుందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా విశాల ప్రజానీకం ఐక్యమై సీపీఐఎంఎల్ ఏర్పాటు స్ఫూర్తితో విముక్తి పోరాటాలలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో శ్రద్ధ పెట్టడం లేదని, ఇతర పార్టీలపై విమర్శలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జక్కుల యాకయ్య, మండల నాయకులు ఈర్ల వెంకన్న, కేశవులు, ఎంకి యాకయ్య, లెనిన్, ప్రసాద్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో తొర్రూరు మండలంతో పాటు పట్టణం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. బహిరంగ సభకు తరలి వెళ్తున్న బస్సులను తొర్రూరుకు చెందిన ప్రముఖ రియల్టర్ బొమ్మన బోయిన రాజేందర్ యాదవ్ బొడ్రాయి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జీనుగా సురేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దొంగరి రేవతి, భూసాని రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జలకం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, నాయకులు మొగుళ్ల అశోక్ గౌడ్, నడిగడ్డ శ్రీనివాస్, దొంగరి శంకర్, ముద్దసాని సురేష్, వెంకటాచారి, దీకొండ మధు, కల్లూరి కుశాల్, బిజ్జాల అనిల్, మనోహర్, వెంకన్న యాదవ్, వినోద్ కుమార్, రామ్మోహన్ రెడ్డి, మంగళపల్లి స్వామి, నాగరబోయిన మహేష్, పుట్ట వెంకన్న, అభిరామ్, రమేష్, ప్రవీణ్ రెడ్డి, అనిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


టి. హర్షిత


బి. హన్సిక


పి. అఖిల


టి. సుశాంత్


ఎస్. చరణ్


ఎం. హారిక


పి. విక్కీ


డి. హర్షవర్ధన్


బి. ప్రణీష్

**వరంగల్ వాయిస్, నడికూడ :** ఇటీవల తెలంగాణ గురుకుల్ సెట్ 2024 విడుదల చేసిన ప్రవేశ పరీక్ష ఫలితాలలో హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 11మంది ప్రవేశ పరీక్ష రాయగా తొమ్మిది మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చ సుదర్శన్ విద్యార్థులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చదువుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని ఈ సందర్భంగా వారితో అన్నారు. తాళ్లపల్లి హర్షిత, భీముడిహన్సిక, పర్షవేణి అఖిల, తాళ్లపల్లి సుశాంత్, శనిగరం చరణ్, మీనుగు హారిక, పట్టెం విక్కీ, దూడ హర్షవర్ధన్, బొల్లారం ప్రణీష్, విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, నిగ్గుల శ్రీదేవి, విద్యా వాలంటీర్లు బాపురావు, పర్షవేణి జ్యోతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 14 కుక్కల పట్టివేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డివిజన్లలో విపరీతంగా కుక్కల బెడద నివారణకు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కుక్కల పట్టివేత సిబ్బంది 14 కుక్కలను బుధవారం పట్టుకెళ్లారని 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు కరీమాబాద్ చాకలి వాడ, ముస్లిం ఏరియా, ప్రతాప్ నగర్, కొత్త కుమ్మరి వాడలలో సిబ్బంది తిరుగుతూ పట్టుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. కుక్కలు పలు వీధులలో సంచరిస్తూ ప్రజలను చిన్నపిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తూ అనేక మందిని కాటు వేయడం వలన బాధితులు ఆస్పత్రి పాలవుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. డివిజన్లలో కుక్కల బెడద నివారణకు శాశ్వత పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకువచ్చి తాను శాయశక్తులా కృషి చేస్తానని కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రజలకు తెలియపరిచారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ ప్రస్తుత ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, గోపీచంద్, పీఏసీఎస్ కాపుల కనపర్తి జీబీ సొసైటీ అధ్యక్షుడు దొమ్మటి సంపత్, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు మొలుగూరి భిక్షపతి, సంగెం మండల పార్టీ అధ్యక్షుడు చోలేటి మాధవ రెడ్డి, గన్నోజు శ్రీనివాస చారి, మాజీ జడ్పీటీసీ పాడి కల్పనా దేవి, సీనియర్ నాయకులు జనగాని రమేష్, కందగట్ల నరహరి, అంజన్ రావు, దుబాసి వెంకటస్వామి, మహిళా నాయకురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

# అనుమతి లేని రీజొనెన్స్ కళాశాల బ్రాంచ్‌లను మూసివేయాలి

## ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కోటా రాజస్తాన్ సంస్థల తోక పేరులతో హనుమకొండ జిల్లా పరిధిలో ప్రభుత్వం నుంచి కేవలం మూడు అనుమతులు పొంది మరో ఐదు చోట్ల అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులను దోచుకుంటున్న రీజోనెన్స్ జూనియర్ కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ జిల్లా డీఐఈఓ గోపాల్ ను డిమాండ్ చేశారు. అనుమతి లేని మరో ఐదు రీజొనెన్స్ జూనియర్ కళాశాలల బ్రాంచ్ లను సీజ్ చేయాల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు. లేని పక్షంలో డీఐఈఓ అనుసరిస్తున్న కార్పొరేట్ కళాశాల అనుకూల వ్యవహార శైలిపై ఇంటర్మీడియట్ బోర్డ్ దృష్టికి తీసుకు వెళ్తూ అనుమతిలేని రిజొనెన్స్ జూనియర్ కళాశాల బ్రాంచ్ లను మూసివేసేంతవరకు పోరాడుతామని హకీమ్ నవీద్ తెలిపారు.

# విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలం నాగరాం గ్రామ శివారులో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహాముని, శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలోప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అరూరి భారీ మెజారిటీతో గెలవడం తథ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 26వ డివిజన్ లోని గిర్మాజీపేట బొడ్రాయి నుంచి 26వ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆడెపు ప్రసాద్ ఆధ్వర్యంలో 102వ,135వ బూత్ లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు, 26వ డివిజన్ కాంటెస్టెడ్ అభ్యర్థి కూచన క్రాంతి కుమార్ పాల్గొని గిర్మాజీ పేట్ బొడ్రాయి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు, 26 వ డివిజన్ కాంటెస్టెడ్ అభ్యర్థి కూచన క్రాంతి కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నీతివంతమైన, స్వచ్ఛమైన పాలన, వారి సంక్షేమ పథకాలే బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ను భారీ మెజారిటీతో గెలిపించడం తథ్యమని అన్నారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలను పంచుతూ మోడీ విజయవంతమైన పాలన గురించి వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో 102 వ బూత్ అధ్యక్షుడు చింతం మహేందర్, డివిజన్ నాయకుడు వంగరి కేశవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్తినేని లక్ష్మణ్, చిలుపూరి రమేష్, భోగ నాగరాజు, డాక్టర్ హరిశంకర్, వంగరి వంశీ, కొండపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఇంగ్లీషు ఉపాధ్యాయులకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎల్టా ఆధ్వర్యంలో పూర్వ వరంగల్ జిల్లాలోని 2024 సంవత్సరంలో పదవీ విరమణ పొందబోతున్న 23 మంది ఆంగ్ల భాష ఉపాధ్యాయులకు బుధవారం స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్, భీమారంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ మండల విద్యాధికారి రాకు రామ్ కిషన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాష ఉపాధ్యాయులు విద్యార్థులలో భాష నైపుణ్యాలను పెంచుటకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో రిటైర్ కాబోతున్న ఆంగ్లభాష ఉపాధ్యాయులను, వారి కుటుంబాలను ఒకచోట చేర్చి సన్మానం చేయడం అనేది ఒక వినూత్న కార్యక్రమంగా వర్ణించారు. ఈ కార్యక్రమంలో ఈ మధ్యనే కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి విద్యా విభాగంలో డాక్టరేట్ పట్టా పొందిన ఆర్.పద్మావతిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పూల శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు జుబేదా, రాష్ట్ర ట్రెజరర్ కే శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పూర్వ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.సంపత్ కుమార్, కె.రవికుమార్, టి.బ్రహ్మం, రామ్మోహన్, శ్యాంసుందర్ రెడ్డి, బాలశౌరి రెడ్డి, ఎల్.వంశీ మోహన్, వంగర లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నేత్రదానంలో ఇద్దరి అంధులకు చూపు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని బాలసముద్రం, అంబేద్కర్ కాలనీ బస్తీ వాసి( గుడిసె వాసి ) మామిడిపల్లి వెంకటమ్మ (65) అనారోగ్యానికి గురి కాగా ఎంజీఎం వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. కుటుంబ సభ్యులు భర్త, కుమారుడు భిక్షపతి, సుధాకర్ , ఐదుగురు కూతుళ్ల సహకారంతో, సమాజ హితం కోరి “”నేత్రదానం చేయుటకు ముందుకు రాగా, “” తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది నేత్ర సేకరణ నిపుణులు లక్ష్మణ్ ద్వారా నేత్ర సేకరణ (నేత్రదానం) చేశారు. బస్తి వాసి వెంకటమ్మ నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపునిచ్చిన వారయ్యారని, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మనం మన మరణానంతరం నేత్రదానం చేసి ఇద్దరి అందులకు చూపునిద్దామని, సామాజిక బాధ్యతను నెరవేర్చుకుందామని, జీవితాన్ని సార్థకం చేసుకుందామని బంధుమిత్రుల సమక్షంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి కోరారు. వివరాలకు 8790548706 మరియు 9703738699 సెల్ నంబర్లను సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, కార్యవర్గ సభ్యులు రాజమౌళి, ఉపేందర్ రెడ్డి, శంకర్రావు యాదవ్, రాజేంద్రప్రసాద్, సంజీవరావు, కేదారి పాల్గన్నారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో షైన్ విజయకేతనం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** తెలంగాణ రాష్ట్ర ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ, బైపీసీలో మొదటి ర్యాంకు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలను అందజేయడం జరిగిందని షైన్ విద్యాసంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగుల రమ, షైన్ రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్ డైరెక్టర్ జె. శ్రీనివాస్, ఐఐటి కో-ఆర్డినేటర్ మూగుల రమేష్ యాదవ్ లు సంయుక్తంగా తెలియజేశారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో షైన్ జూనియర్ కాలేజీ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. షైన్ విద్యా సంస్థలు మొదటి నుంచి ఇంటర్మీడియట్ విద్యలో అత్యుత్తమమైన శిక్షణను వరంగల్ అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా అద్భుతమైన ఆణిముత్యాలుగా తయారుచేసి రాష్ట్రస్థాయిలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఆర్.సంజయ్ -468, ఎం.సంజయ్-467, జి.వికాస్-467, 7గురు విద్యార్థులకు 466 మార్కులు, 8మంది విద్యార్థులకు 465 మార్కులు, బైపీసీ మొదటి సంవత్సరంలో కె. సహస్ర-436, డి.ఇందు-436, వై.చందన-436, ఈ.సాహితి-436, బి.సాయి నివేదిత- 436, ఎస్. సాయి ప్రశాంతి-436, ముగ్గురు విద్యార్థులకు 435 మార్కులు, ముగ్గురు విద్యార్థులకు 434 మార్కులు, ఇద్దరు విద్యార్థులకు 430 మార్కులు, రెండవ సంవత్సరం ఎంపీసీలో వి.సరయు-992, పి.వేద 987, ముగ్గురు విద్యార్థులకు 986 మార్కులు, బైపీసీలో టి.హెరీమ ప్రియ-991, బి. శ్రీపూజ-990 సాధించిన విద్యార్థులను అభినందించారు. వీరితో పాటుగా రెండవ సంవత్సరం ఎంపీసీలో 970 మార్కులకు పైగా 25 మంది విద్యార్థులు, బైపీసీలో 960కి పైగా 20 మంది విద్యార్థులు అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీలో 460 పైగా మార్కులు 45 మందికి పైగా, 15 మందికి పైగా విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, కొత్తకొండ శ్రీనివాసన్ గౌడ్, ప్రవళిక, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మోషన్ కాలేజీ విజయ దుందుబి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బుధవారం ప్రకటించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో హనుమకొండలోని రాజస్థాన్ కోటా మోషన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి విజయ దుందుబి ఎగరవేసినట్లు కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక బృందానికి, సహకరించిన తల్లిదండ్రులకు మరియు శ్రేయోభిలాషులకు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డైరెక్టర్ చిర్ర గణేష్ గౌడ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు. మోషన్ జూనియర్ కాలేజీ స్టేట్ ర్యాంక్ లు సాధించిన మా విద్యార్థులు ఎంపీసీ మొదటి సంవత్సరం టాపర్స్ గా గుండవేణి అశ్విత (2438120361)-467, కొడుపాక ప్రహర్శిత (2438119962)- 467, జక్కుల ధమాన్ (2438120912)- 467, రాచర్ల హాసిక (2438119250)-466, గుడి వంశీప్రియా (2438119445)- 466, కందకట్ల సుకన్య (2438120415)-465, బూర్ణ వర్షని (2438119780)-464, దుంపేటి శ్రీనిహా (2438119851)-464, మర్రి హేమంత్ కుమార్ (2438119019)-464, కొత్తపల్లి వర్షిణి (2438119423)-463, లింగాల మనస్విని (2438118808)-463, శామంతుల శ్రీనిధి(2438118556)-462, అమరగొండ రిషిత (2438120685)-462, బైరి శ్రీహర్షిత్ (2438120124)-462, ముత్తుజు నాయిని (2438119551)-460, బైపీసీల టాపర్స్ గా సాగుప్త మహావీన్ (2438120184)-436,బండి రేణుక (2438120153)-436, గండ్ర షణ్ముఖశ్రీ (2438118247)-436, సోఫియా టాబస్సుమ్ (2438120646)-435, భూక్య హాశ్విక (2438118600)-433, బొమ్మ రిషిత (2438119766)-433, బొమ్మకంటి నిహారిక (2438118934)-432 నిలిచారు.

## ఇంటర్ ఫలితాల్లో శివాని ప్రభంజనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్ ఫలితాలలో హనుమకొండ భీమారం శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయ దుందుభి మోగించారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలను సాధిస్తూ నేడు ప్రకటించిన ఫలితాలలో మరోసారి చరిత్రను తిరగరాస్తూ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో ఒకరు 468/470, ఐదుగురు విద్యార్థులు 467/470 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు 436/440,నలుగురు విద్యార్థులు 435/440 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీ విభాగంలో ముగ్గురు విద్యార్థులు 989/1000, ఇద్దరు విద్యార్థులు 988/1000 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో ఒకరికి 981/1000, మరొకరికి 980/1000 మార్కులు విజయం సాధించారు. విజయం సాధించిన శివాని విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి, ప్రిన్సిపల్స్ జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేష్, ఏ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్ రెడ్డి, అభినందనలు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లితండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్‌డీ విద్యార్థుల విజయభేరి


P.Aravind-988


P.SINDHU-985

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఆర్ డీ కళాశాల విజయ ఢంకా మ్రోగించింది. ఎంపీసీ, బైపీసీ విభాగంలో ద్వితీయ సంవత్సర ఫలితాలలో 988, 985 మార్కులు సాధించటమే కాక 980 మార్కులకు పైగా 10 మంది విద్యార్థులు విజయం సాధించారని ఆర్ డీ యాజమాన్యం తెలిపింది. తెలంగాణా రాష్ట్రంలోని కళాశాలలో ఉత్తీర్ణత శాతంలో కూడా ఆర్ డీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. గత రెండు దశాబ్దాలుగా ఆర్ డీ కళాశాల ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి మార్కులు సాధిస్తూ తన స్థానం ఎప్పుడు ఉన్నతంగా నిలుపుకుంటుంది. ఎంపీసీ విభాగంలో ప్రథమ సంవత్సర ఫలితాలలో 466, 466, 460 మార్కులకు పైగా 11 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ప్రథమ సంవత్సర ఫలితాలలో 436, 436, 430 మార్కులకు పైగా 10 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈ అద్భుత విజయాలను సాధించిన విద్యార్థులను అంకితభావంతో పనిచేసిన అధ్యాపకులను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలల యాజమాన్యం డాక్టర్ కోడూరి రామమూర్తి , శ్రీ బండి మల్లేశం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# దేశంలో ఇండియా కూటమిదే విజయం

## మానుకోటలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించాల్సిందిగా బుధవారం మహబూబాబాద్ జిల్లా సీపీఐ ఆఫీసుకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ వచ్చి సీపీఐ నాయకులను కోరారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్టు బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించడం ఖాయమని అన్నారు. దేశంలో బీజేపీ ఓటమి ఖాయం అయిపోయిందని, ఆ పార్టీపై భ్రమలు తొలిగిపోయాయన్నారు. మొన్న జరిగిన మొదటి దశ పార్లమెంటు ఎన్నికల్లో 102 సీట్లలో అత్యధిక స్థానాలు ఇండియా కూటమి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ లో మెజార్టీ స్థానాలు ఇండియా కూటమి కైవసం చేసుకుంటుందని తెలిపాయని అన్నారు. అందుకే ప్రధాని మోడీ రెచ్చగొట్టే విధంగా ఎన్నికల సభలలో మాట్లాడుతున్నారన్నారు. అయినా ఎన్నికల సంఘం మోడీపై కేసులు నమోదు ఎందుకు చేస్తలేదన్నారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎలక్షన్ కమిషన్ బీజేపీపై చర్యలు ఎందుకు తీసుకుంట లేదన్నారు. ఇండియా కూటమి 350 సీట్లలో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్ లోక్ సభ ఇండియా కూటమి అభ్యర్థి బలరాం నాయక్ ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా సీపీఐ శ్రేణులను ప్రజలను ఆయన కోరారు. బలరాం నాయక్ గెలుపు కోసం సీపీఐ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2014, 2019 ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచిన సీతారాం నాయక్, మాలోత్ కవిత మహబూబాబాద్ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. విభజన హామీలైన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కోసం పార్లమెంటులో నోరు మెదపలేదన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏ ఒక్క అభివృద్ధి పని కూడా నాడు సీతారాం నాయక్, నేడు మాలోతు కవిత చేయలేదన్నారు. వారిద్దరిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి అభ్యర్థి బలరాం నాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా సీపీఐ మద్దతుతో దేశంలో అధికారంలోకి వస్తామని జోస్యం చెప్పారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో సీపీఐ శ్రేణులు నా గెలుపు కోసం కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్ సారధి రెడ్డి, నల్ల సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, సీపీఐ నాయకులు పెరుగు కుమార్, కట్లోజు పాండురంగా చారి, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, దండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ , బానోతు లింగ్యా నాయక్,మేక వీరన్న ఆబోతు అశోక్ జలగం ప్రవీణ్ వంకాయలపాటి చిరంజీవి, మాగంలోకేష్, నాదెండ్ల పద్మ, వెంకట్ రెడ్డి, కళింగ రెడ్డి , సత్యనారాయణ, చిర్ర వెంకన్న పాల్గొన్నారు.

## ఎంపీగా సీతారాం నాయక్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ ఎంపీగా సీతారాం నాయక్ భారీ మెజారిటీతో గెలుపొందుతారని ఆయన కోడలు పేర్కొన్నారు. బుధవారం డోర్నకల్ మండలంలోని దుబ్బ తండా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ధ్వజ స్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ, బుడియా బాబు సద్రం స్వామి, ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో భాజపా ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ సమ్మక్క సారక్క పేరుతో ములుగు జిల్లా కేంద్ర ఏర్పాటు కొల్లాపూర్ నుంచి మణుగూరుకు కొల్లాపూర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ కాజీపేటలో మంజూరు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏకలవ్య పాఠశాల నిర్మాణం, 80 కోట్ల వ్యయంతో డోర్నకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం లాంటి పనులు చేపట్టారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రధాని మోడీ నూతన సంస్కరణలు పథకాలను తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కొత్తగూడెం వరకు నూతనంగా రూ.700 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ప్రాంత ప్రజలు తప్పక ఆదరించి భాజపా అభ్యర్థి సీతారామ నాయక్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భాజపా మండల అధ్యక్షుడు గణేష్ ఉన్నారు.

## నూతన పోలింగ్ కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా మంగపేట మండలంలో నూతనంగా ఏర్పాటుచేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజతో కలిసి పరిశీలించారు. బుధవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చిత్రా మిశ్రా మంగపేట మండలంలో 214ఏ తొండాల లక్ష్మీపురం, 218ఏ నరేంద్ర రావు పేట, 235ఏ కొత్త చీపురు దుబ్బ, 239ఏ శనిగకుంటలో నూతనంగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్స్ , లైటింగ్, ఎలక్ట్రిసిటీ, తాగునీరు, టాయిలెట్స్ వంటి తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ మల్లేశ్వరరావు, ఆర్ఐ శ్రీను, నూతన పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు మంకిడి శివ, తాటి సునీత, కొమరం చంద్రకళ, పెండ్యాల సుజాత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు డివిజన్ కేంద్రంలో నాటు సారాయి స్థావరాలపై బుధవారంఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ దాడులు నిర్వహించింది. ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు సారథ్యంలోని తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ లో పోలీసులు మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గ్రామాలలో తండాలలో దాడులు నిర్వహించి 24 మందిపై కేసు నమోదు చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 140 లీటర్ల నాటు సారాయిని 500 కేజీల బెల్లం పట్టికను స్వాధీన పరుచుకున్నామని పేర్కొన్నారు. 10200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో మొత్తం 17 వాహనాలు, బైండోవర్ కాబడిన వ్యక్తులతో పాటు అంబర్, నాటు సారాయి, బెల్లం పటిక, మద్యం పానకం సాధీనపరచుకున్నారు. దీని విలువ రూ.59,30,000 ఉంటుందని వారు తెలిపారు. ఈ తనిఖీలు తొర్రూరు, పాలకుర్తి, వరంగల్ ఎన్ ఫోర్ మెంట్ హనుమకొండ, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, గూడూరు, మహబూబాబాద్, డీటీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవ చేసే స్థాయికి ఎదగాలి

### ప్రణయ్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి

### మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సమాజ సేవ చేసే స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు పేరు తీసుకురావాలని సివిల్ లో ఐఏఎస్ సాధించిన రఘునాథపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ ను మానకొండూర్ ఎమ్మెల్యే కావాంపల్లి సత్యనారాయణ సన్మానం చేశారు. బుధవారం హైదరాబాదులోని తాజ్ కృష్ణ హోటల్ లో ఐఏఎస్ సాధించిన కొయ్యడ ప్రణయ్ కుమార్ ను పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో యువత సెల్ ఫోన్లు, టీవీలకు బానిస కాకుండా తల్లిదండ్రులు చెప్పిన మాటలు వింటూ గురువు చెప్పిన దారిలో నడుస్తూ పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ప్రణయ్ కష్టాలను అధిగమించే కలెక్టర్ స్థాయికి రావడం అభినందించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో సమాజ సేవ చేసే స్థాయికి మీరు ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్టీఎస్ ఆఫీసర్ భారత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## అరూరి రమేష్ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 56 వ డివిజన్ సురేంద్రపురి కాలనీలో శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర సహిత శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, డివిజన్ అధ్యక్షులు మహేందర్, ప్యాక్స్ చైర్మన్లు వనం రెడ్డి, రమేష్ గౌడ్, బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగర వ్యాప్తం గా పలు భవన నిర్మాణాల అనుమతుల మంజూరు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల అందజేత కోసం పలువురు నగర వాసులు దరఖాస్తులు చేసుకున్న నేపథ్యంలో బుధవారం క్షేత్ర స్థాయిలో కమిషనర్ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ పరిధిలోని గోపాల్ పూర్, భీమారం కిట్స్ కళాశాల ప్రాంతంలో భవన నిర్మాణ అనుమతుల కోసం, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం హనుమకొండ పరిధిలోని సిద్ధార్థ నగర్, ప్రకాష్ రెడ్డి పేటతో పాటు వరంగల్ పరిధిలోని శంభునిపేట ప్రాంతంలో కమిషనర్ పర్యటించి నిర్మాణాలు చేపట్టిన భవనాలు నిర్దేశిత ప్రమాణాలు పాటించారో లేదో తెలుసుకోవడానికి కొలతలతో పరిశీలించి నిర్ధారించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ టీఎస్ బీపాస్ లో సూచించిన విధంగా ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు చేపట్టే భవనాలకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న సీఎంహెచ్ఓ డా.రాజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి బషీర్, శానిటరీ ఇన్ స్పెక్టర్లు భాషా నాయక్, భీమయ్య, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



# లవ్ మీ చిత్రం విడుదల వాయిదా



టాలీవుడ్ యువ నటులు ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' ఉపశీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మిస్తుండగా.. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నాడు. ఓ కుర్రాడు దెయ్యాన్ని ప్రేమించాలనుకుంటే ఎలా ఉంటుంది..ఏమవుతుందనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను మొదట ఏప్రిల్ 27న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అనుకోని కారణాల వల్ల సినిమా తేదీ వాయిదా పడింది. ఇప్పుడు తాజాగా మరో కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మే 25న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రానికి కెమెరా: పీసీ శ్రీరామ్, సంగీతం: కీరవాణి, నిర్మాణ సంస్థ: దిల్‌రాజు ప్రొడక్షన్స్.ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో ఎన్నికల హంగామా, విపరీతమైన ఎండలు, దానికి తోడు ఐపీఎల్ క్రికెట్ మ్యాచులు ఒక దానితో పోటీ పడి మరోటి ఇలా చాలా అడ్డంకులు ఎదురవుతుండడంతో సినిమా చూడటానికి ప్రేక్షకులు వస్తారా అని చిన్న సందేహంతో వాయిదా వేసినట్టుగా తెలుస్తోంది. ఈ హడావుడి అంతా ముగిశాక మే 25న లవ్ మీ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# అపర్ణాదాస్ ఏడడుగులు



'ఆదికేశవ'తో తెలుగువారికి సుపరిచితురాలైన నటి అపర్ణాదాస్. హీరో సోదరి పాత్రలో నటించి, ఇక్కడి ప్రేక్షకులను అలరించారు. తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 'మంజుమ్మెల్ బాయ్స్'తో ఇటీవల విజయాన్ని అందుకున్న మలయాళీ నటుడు దీపక్ పరంబోల్‌తో ఆమె ఏడడుగులు వేశారు. కేరళలోని గురువాయూర్ దేవాలయంలో బుధవారం ఉదయం వీరి పెళ్లి ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాల పెద్దలు, సన్నిహితులు ఈ వేడుకకు హాజరయ్యారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో తాజాగా నెట్టింట వైరల్‌గా మారింది. నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'నాన్ ప్రకాశన్'తో నటిగా తెరంగేట్రం చేశారు అపర్ణాదాస్. 2019లో విడుదలైన 'మనోహరమ్' హీరోయిన్‌గా ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే దీపక్ పరంబోల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారి.. పెద్దల అంగీకారంతో ఇప్పుడు పెళ్లి చేసుకున్నారు. 2023లో విడుదలైన 'డాడా' అపర్ణాదాస్ కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె మలయాళంలో తెరకెక్కుతోన్న 'ఆనంద్  శ్రీబాల' కోసం వర్క్ చేస్తున్నారు.



# సర్దార్‌కు సీక్వెల్

పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'సర్దార్'. 2022లో విడుదలై సూపర్ హిట్ జాబితాలో నిలిచింది. వసూళ్ల పరంగా రూ.100 కోట్లు సాధించింది. మినరల్ వాటర్ పేరుతో విక్రయించే తాగునీటిలో ఉండే శరీరానికి హాని కలిగించే అంశాలు, వాణిజ్య పరమైన రాజకీయాలను దర్శకుడు కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఇందులో హీరో కార్తీ పోలీస్ ఆఫీసర్‌గా, రా ఏజెంట్‌గా నటించి, ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నారు. యాక్షన్, థ్రిల్లర్ కోణంలో సాగిన ఈ చిత్రంలో రజీషా విజయన్, రాశీఖన్నా, లైలా, చుంకీపాండే ప్రధాన పాత్రలను పోషించగా జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సీక్వెల్ సర్దార్ 2 రూపొందనుంది. కార్తీజన్మదినం సందర్భంగా మే 25న ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీపావళికి ఫస్ట్ లక్ రిలీజ్ చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ దఫా సినిమాలో డ్రగ్స్ అక్రమ రవాణాను ప్రధానాంశంగా చేసుకుని 'సర్దార్-2'ను తెరకెక్కించాలని దర్శకుడు పీఎస్ మిత్రన్ ప్లాన్ చేసినట్టు సమాచారం. ముఖ్యంగా సమాజానికి, యువతకు మాదకద్రవ్యాలు ఏ విధంగా హాని కలిగిస్తున్నాయే అంశంతో యవతలో చైతన్యం, అవగాహన కల్పించేలా ఈ కథను సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది.






# దేవరకొండతో ప్రశాంత్ నీల్ భేటీ

## 'సలార్ 2' సినిమా కోసమేనా అన్న ఊహాగానాలు

కెరీర్ పరంగా బిగ్గెస్ట్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు నటుడు విజయ్ దేవరకొండ ఇటీవల 'ఫ్యామిలీస్టార్'గా ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు. ప్రస్తుతం ఆయన దృష్టి గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్‌పైనే ఉంది. ఇదిలా ఉండగా, ఇటీవల హైదరాబాద్ వచ్చిన ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ ఆయన్ని కలిశారు. దీంతో వీరిద్దరి కాంబోలో కొత్త ప్రాజెక్ట్ ఉండొచ్చని పలు కథనాలు చక్కర్లు కొట్టాయి. అయితే, అందులో నిజం లేదని వాళ్ల టీమ్స్ క్లారిటీ ఇచ్చాయి.'సలార్'తో గతేడాది విజయాన్ని అందుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ హీరోగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ఘన విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్‌గా 'సలార్ శౌర్యంగపర్వం' రూపుదిద్దుకోనుంది. ఎపిక్ యాక్షన్ మూవీగా సిద్ధం కానున్న ఈ ప్రాజెక్ట్‌లో విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'సలార్ 2' చివర్లో కనిపిస్తారని.. ఆయన రోల్ సినిమాలో ఆసక్తిగా ఉండనుందని టాక్. దీనిపై టీమ్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో వీరిద్దరూ కలిసింది కొత్త సినిమా కోసం కాదని.. 'సలార్ 2' కోసమేనని పలువురు అంటున్నారు.





# విశ్వక్‌సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే గామి సినిమాతో హిట్ కొట్టిన ఈ కుర్ర హీరో తాజాగా మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు. విశ్వక్‌సేన్ ప్రధానపాత్రలో వస్తున్న తాజా చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి  ఈ మూవీకి ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తుండగా.. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను తెలంగాణ లోక్‌సభ ఎన్నికల అనంతరం మే 17న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ టీజర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను ఏప్రిల్ 27 సాయంత్రం 4.01 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.  ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



# రెండో సెట్ నామినేషన్ వేసిన కడియం కావ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ , వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలతో కలిసి బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్ వద్ద డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపిస్తే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వరంగల్ ను అగ్రగామిగా నిలుపుతానన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా మీకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన 'ములుగు'

## సెకండ్ ఇయర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్

## 82.95 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ములుగు జిల్లా సత్తా చాటింది. సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణత సాధించిన ములుగు జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలువగా, మొదటి సంవత్సర ఫలితాల్లో 70.01 శాతం ఉత్తీర్ణత సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి. బుధవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. అదేవిధంగా ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.70 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా, 71.58 శాతంతో మేడ్చల్ జిల్లా ద్వితీయ స్థానం, 70.01 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి.



# 28న కేసీఆర్ రోడ్ షో..


## సభా స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 28న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వరంగల్ లో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు బుధవారం హనుమకొండ అంబేద్కర్ కూడలి, పెట్రోల్ పంప్ కూడలి, హనుమకొండ చౌరస్తా స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకట రమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, బొల్లం సంపత్ కుమార్, మెట్టు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భర్త గుర్తుగా గుడి

## ప్రేమను చాటుకున్న భార్య



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కడవరకు కలిసుంటానని బాస చేసిన భర్త కరోనా మహమ్మారితో అర్ధాంతరంగా తనువు చా లి ం చ్ డ్ ం తో తట్టుకోలేకపోయిన ఆ శ్రీమతి పతియే ప్రత్యక్ష దైవంగా భావించి నిత్యం ఆయన సేవలో తరించాలన్న సంకల్పంతో తమ వ్యవసాయ భూమిలో దేవాలయాన్ని నిర్మించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోమ్లా నాయక్ తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే సోమ్లా నాయక్ తండాకు చెందిన బానోతు హరిబాబు-కల్యాణి దంపతులు. వీరు తమకున్న వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అన్యోన్యంగా సాగుతున్న వారి జీవితంలో కరోనా మహమ్మారి విషాద చాయలు నింపింది. హరిబాబు కరోనా కారణంగా అర్ధాంతరంగా తనవు చాలించారు. ఆయన మృతిని భార్య తట్టుకోలేకపోయింది. ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా గుర్తుండాలన్న ప్రేమతో రాజస్థాన్‌లో భర్త మాదిరి పాలరాతి విగ్రహాన్ని తయారు చేయించి తండా ప్రధాన రహదారి ప్రక్కనే ఆలయం నిర్మించి వేదపండితుల మంత్రోచ్ఛారణలు, విశేష అలంకరణల నడుమ అంగరంగ వైభవంగా హరిబాబు విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. మృతి చెందిన భర్తను నిత్యం పూజిస్తూ కళ్యాణి తన ప్రేమను చాటుకుంటోంది. ప్రతి సంవత్సరం హరిబాబు జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించి అన్నదానం నిర్వహించనున్నట్లు కల్యాణి ప్రకటించారు.

# ఇంటర్ తప్పడంతో..

## విద్యార్థిని ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్టులో రెండు మార్కులు తక్కువ రావడంతో మనస్థాపానికి గురై గ్రామానికి చెందిన చిప్ప భార్గవి (17) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని డోర్నకల్ మోడల్ స్కూల్లో పదో తరగతి అభ్యసించి గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణురాలై వరంగల్ లోని ఆరేపల్లిలో ఇంటర్మీడియట్ విద్య అభ్యసించింది. తన బాబాయ్ తో ఫెలయ్యానని ఏడుస్తూ విలపించింది. రీవాల్యుయేషన్ పెట్టిద్దామని ధైర్యం చెప్పినప్పటికీ ఆత్మహత్యకు పాల్పడింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# నామినేషన్ దాఖలు చేసిన అరూరి రమేష్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లోక్ సభ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అరూరి రమేష్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కాళీ ప్రసాద్ లతో కలిసి వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో నామ పత్రాలను దాఖలు చేశారు.



# శంకర్ కుటుంబానికి అండగా ఉంటా

## పరామర్శించి మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** చత్తీస్ ఘడ్ జిల్లాలో తాజాగా జరిగిన ఎన్ కౌంటర్ లో మరణించిన మావోయిస్టు శంకర్ దంపతుల కుటుంబాన్ని మంత్రి సీతక్క బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి వెళ్లి పరామర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన మావోయిస్టు సుధాకర్ అలియాస్ శంకర్ చత్తీస్ ఘడ్ రాష్ట్రం కాంకేడ్ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. శంకర్ తల్లి రాజ పోచమ్మను ఓదార్చడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ జిల్లా మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com